


మంగళవారం 21 జూలై 2026 పేజీలు : 8

## తహశీల్దార్ చంద్రమోహన్ రెడ్డిని సన్మానించిన మీసేవ నిర్వాహకులు



నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 20: నారాయణఖేడ్ తహశీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన చంద్రమోహన్ రెడ్డిని సోమవారం మీసేవ కేంద్రాల నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తహశీల్దార్‌కు శాలువా కప్పి, పూలమాల వేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు తమ వంతు సహకారం అందిస్తామని మీసేవ నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మీసేవ నిర్వాహకులు పాండురంగారెడ్డి, కృష్ణ, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.




### ముందస్తు చర్యలతో ఎల్-నినో ప్రభావాన్ని

# సమర్థవంతంగా ఎదుర్కొందాం

**ఎల్-నినో సవాళ్లను ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి**

**రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి**

**మెదక్, సంగారెడ్డి జిల్లాల ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికపై మంత్రి సమీక్ష**

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి జూలై 20:**

ఎల్-నినో ప్రభావం కారణంగా తలెత్తే ప్రతికూల పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు ముందస్తు కార్యాచరణతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి,మెదక్ జిల్లాలలో ఎల్-నినో ప్రభావ తీవ్రతను తగ్గించేందుకు ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికపై సోమవారం సంగారెడ్డి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మెదక్, సంగారెడ్డి జిల్లాల అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎల్-నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు శాఖల వారీగా - మిగతా3లో



## 26న కంగ్టి మండలం దేగుల్‌వాడికి నవోదయ సిద్ధార్థ రాక



నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 20: ఈ నెల 26వ తేదీన కంగ్టి మండలం దేగుల్‌వాడి గ్రామానికి ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ చైర్మన్ నవోదయ సిద్ధార్థ రానున్నట్లు ఆ సంస్థ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి యం.ఏ. ఖైసర్ తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొంటూ..నారాయణఖేడ్ నియోజకవర్గంలోని కంగ్టి మండలం దేగుల్‌వాడి గ్రామానికి చెందిన బాధితులు ఇటీవల హైదరాబాద్‌లోని ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ కార్యాలయాన్ని సందర్శించి తమకు న్యాయం చేయాలని సంస్థ చైర్మన్ నవోదయ సిద్ధార్థను కోరినట్లు తెలిపారు. బాధితుల విజ్ఞప్తి మేరకు ఈ నెల 26వ తేదీన నవోదయ సిద్ధార్థ దేగుల్‌వాడి గ్రామాన్ని సందర్శించి బాధితుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోనున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్రానికి చెందిన సంస్థ బాధ్యులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

### పనులు చేయకుండానే

# బిల్లుల చెల్లింపులు?

**కొండాపూర్ మండలంలో సర్పంచ్‌లు--ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులపై ఆరోపణలు**



# అంకితభావానికి గుర్తింపు..

# మెదక్ బీజేవైఎం జిల్లా అధ్యక్షుడిగా కే శ్రీనివాస్ గౌడ్

**సామాన్య కార్యకర్త నుంచి జిల్లా అధ్యక్షుడి వరకు... శ్రీనివాస్ గౌడ్ రాజకీయ ప్రస్థానానికి మరో మైలురాయి..!**



**వెల్దుర్తి (ప్రజాజ్యోతి) జులై 20:** తెలంగాణ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ ఎన్. రామచందర్ రావు ఆదేశాల మేరకు, భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) మెదక్ జిల్లా అధ్యక్షుడిగా వెల్దుర్తి మండలం ఎదుళ్లపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్ గౌడ్ నియమితులయ్యారు. సాధారణ కార్యకర్తగా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన శ్రీనివాస్ గౌడ్, పార్టీ సిద్ధాంతాల ప్రచారం, యువతను సంఘటితం చేయడం, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయడం, సేవా కార్యక్రమాల్లో ముందుండడం ద్వారా ప్రత్యేక గుర్తింపు పొందారు. క్రమశిక్షణ, అంకితభావం, ప్రజలతో మమేకమయ్యే నాయకత్వ లక్షణాలను గుర్తించిన పార్టీ అధిష్ఠానం ఆయనకు మెదక్ జిల్లా బీజేవైఎం అధ్యక్ష బాధ్యతలను అప్పగించింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి ఈ కీలక బాధ్యత అప్పగించిన పార్టీ జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలను గ్రామ స్థాయి నుంచి ప్రతి యువకుడి వరకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని, మెదక్ జిల్లాలో బీజేవైఎంను మరింత బలోపేతం చేసి యువతకు పార్టీ వేదికగా నిలిచేలా నిరంతరం పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ నియామకం పట్ల వెల్దుర్తి మండలం, ఎదుళ్లపల్లి గ్రామంలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, అభిమానులు పెద్ద సంఖ్యలో శ్రీనివాస్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన నాయకత్వంలో మెదక్ జిల్లాలో బీజేవైఎం మరింత శక్తివంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. సామాన్య కార్యకర్త నుంచి జిల్లా అధ్యక్షుడి వరకు శ్రీనివాస్ గౌడ్ రాజకీయ ప్రయాణం యువతకు ఆదర్శంగా నిలుస్తుందని, ఆయనకు దక్కిన ఈ బాధ్యత మెదక్ జిల్లా బీజేపీ, బీజేవైఎం శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతుందని పార్టీ నాయకులు పేర్కొన్నారు.

## రోడ్లపై కేజీ వీల్స్ ట్రాక్టర్లు నడిపితే తీవ్రంగా చర్యలు.

# భారీ జరిమానాలు విధిస్తాం

**శివ్వంపేట ఎస్సై చల్ల మధుకర్ రెడ్డి**



**శివ్వంపేట ప్రజాజ్యోతి జూలై 20:** శివ్వంపేట మండలంలో ఉన్న ఆయా గ్రామాల్లోని ప్రధాన రహదారులపై కేజీ వీల్స్ ట్రాక్టర్లు నడిపి రోడ్లను ధ్వంసం చేస్తే వాహనాలను సీజ్ చేయడంతో పాటు భారీగా జరిమానా విధిస్తామని స్థానిక ఎస్సై చల్ల మధుకర్ రెడ్డి,హెచ్చరించారు. సోమవారం నాడు ఆయన మాట్లాడుతూ.చాలా రోజుల నుండి మండలంలో ని బీటీ రోడ్లపై కేజీ వీల్స్ ట్రాక్టర్లు నడుపుతూ రహదారులను ధ్వంసం చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని.ఈ విషయాన్ని తాము సీరియస్ గా తీసుకున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు.రోడ్లు ధ్వంసం వల్ల వాహనదారులు ప్రజలకు ప్రమాదాలు  జరుగుతున్నాయంటూ ఫిర్యాదులు అందినట్లు ఎస్సై మధుకర్ రెడ్డి వివరించారు.నేటి నుండి రోడ్లపై కేజీ వీల్స్ ట్రాక్టర్లు నడపడాన్ని పూర్తిగా నిషేధిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు.పొలాల్లో పనుల కోసం నడిపే కేజీ వీల్స్ (ఇనుప చక్రాలు) అమర్చిన ట్రాక్టర్లను ఎట్టి పరిస్థితుల్లో ప్రధాన రహదారులపై అదేవిధంగా అంతర్గత రోడ్లపై నడపవద్దని ఆయన హెచ్చరించారు.పాడైన రోడ్ల వల్ల ద్విచక్ర వాహనదారులు. ప్రమాదాల బారినపడి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని ఆయన అన్నారు.ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేసినందుకు కఠిన చర్యల తో పాటు.భారీగా జరిమానాలు విధిస్తామని ఎస్ఐ మధుకర్ రెడ్డి, స్పష్టం చేశారు.పోలీస్ యంత్రాంగానికి ప్రజల రక్షణ.రోడ్ల భద్రత ప్రధానంగా ముఖ్యమని ఆయన తెలిపారు.ప్రతి ఒక్కరూ పోలీస్ యంత్రాంగానికి పూర్తి సహకారం అందించాలని ఎస్సై మధుకర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## చెస్ ఆటతో ఆలోచనలకు పదును..

## విద్యార్థులకు లయన్స్ క్లబ్ ప్రోత్సాహం

**ప్రపంచ చెస్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు చెస్ బోర్డుల పంపిణీ**

**లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ డాక్టర్ సీఆర్ జానకిరామ్**






**తూప్రాన్ (ప్రజాజ్యోతి) జూలై 20:** తూప్రాన్ పుట్టకోట ప్రభుత్వ ప్రా థమిక పాఠశాలలో ప్రపంచ చెస్ దినోత్స వాన్ని పురస్కరించుకుని తూప్రాన్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. 4వ, 5వ తరగతి విద్యార్థులకు చెస్ బోర్డులను అందజేసి, చెస్ పోటీలను నిర్వహించి విజేతలను సత్కరించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ డాక్టర్ జానకిరామ్ సీఆర్ మాట్లాడుతూ, చెస్ కేవలం ఆట మాత్రమే కాదని, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, ఆలోచనా విధానం, నిర్ణయ సామర్థ్యాన్ని పెంపొందించే మేధో క్రీడ అని అన్నారు. మొబైల్ గేమ్స్‌కు బదులుగా విద్యార్థులు చెస్ వంటి ఉపయో గకరమైన ఆటలను అలవాటు చేసుకోవాలని సూచించారు. పాఠశాల ఉపాధ్యాయులు లయన్స్ క్లబ్ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, విద్యార్థుల్లో మేధో వికాసానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ పట్లోరి లక్ష్మణ్, సెక్రటరీ జనరల్ లయన్ పల్లెర్ల బాలేష్ గుప్త, లయన్ కొక్కొండ చంద్ర శేఖర్ రెడ్డి, లయన్ డాక్టర్ అప్సర్, లయన్ కుమ్మరి రమేష్,ఉపాధ్యాయులు జ్యోతి, దుర్గా, శ్రీవాణి, వనిత, రజిత, తిరుమల, అరుణ, నరేష్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్, పార్టీ సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలి: కేటీఆర్

**–కేటీఆర్‌ను కలిసిన ఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి**



**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 20:** ఎస్ఐఆర్, పార్టీ సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావు అన్నారు. సోమవారం కేటీఆర్ ను నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ...ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ చురుకుగా పాల్గొని తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే త్వరలో ప్రారంభం కానున్న బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కార్యకర్తలు సమిష్టిగా కృషి చేసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రానున్న 2028 శాసనసభ ఎన్నికల్లో నారాయణఖేడ్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి విజయం కోసం పార్టీ శ్రేణులు అహర్నిశలు శ్రమించాలని, గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీయ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాజు నాయక్, మాజీ సర్పంచ్ రవీందర్ నాయక్, నాయకులు కృష్ణ గౌడ్, రమేష్, సురేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సామర్థ్యాల పెంపే లక్ష్యం

## చౌటకూర్‌లో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ టీచర్ ట్రైనింగ్ ప్రారంభం

**అందోల్, జూలై 20, (ప్రజాజ్యోతి):** విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలంటే ముందుగా ఉపాధ్యాయుల సామర్థ్యాలను పెంపొందించాల్సిన అవసరం ఉందనే లక్ష్యంతో తెలంగాణ సమగ్ర శిక్ష చౌటకూర్ మండలంలో ఇంటిగ్రేటెడ్ టీచర్ ట్రైనింగ్‌ను ప్రారంభించింది. ఉపాధ్యాయుల్లో బోధనా నైపుణ్యాలు, సబ్జెక్టుపై అవగాహన, సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని పెంపొందించడంపై ఈ శిక్షణ దృష్టి సారిస్తోంది. మొదటి విడత జూలై 20 నుంచి 22 వరకు, రెండో విడత జూలై 23 నుంచి 25 వరకు నిర్వహించనున్నారు. ప్రతి పాఠశాల నుంచి 50 శాతం మంది సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు ఒక్కో విడతలో పాల్గొంటున్నారు. దీంతో అన్ని ఉపాధ్యాయులు దశలవారీగా శిక్షణ పొందే అవకాశం కల్పించారు.

**డిజిటల్ బోధనకు ప్రాధాన్యం**

తరగతి గదిలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ (ఐఎఫ్‌పీలు), డిజిటల్ కంటెంట్ వినియోగం, కార్యాచరణ ఆధారిత బోధన, విద్యార్థుల అభ్యాస మూల్యాంకనం వంటి అంశాలపై ప్రత్యేకంగా శిక్షణ అందిస్తున్నారు.

**మండల స్థాయిలో నిపుణుల సేవలు**

జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన నలుగురు మండల రిసోర్స్ పర్సన్లు



తెలుగు, ఇంగ్లీష్, గణితం అంశాల్లో శిక్షణ అందిస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ కొనసాగుతోంది.

మండల వనరుల కేంద్రం అధికారి అనురాధ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఎంఈఓ అనురాధ, సీఆర్‌పీలు ఆంజనేయులు, వినయ్ కుమార్, రిసోర్స్ పర్సన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. శిక్షణ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో బోధన నాణ్యత మరింత మెరుగుపడుతుందని విద్యాశాఖ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# మండలస్థాయి వృత్త్యంతర ఉపాధ్యాయ శిక్షణ ప్రారంభం

**రాయికోడ్ జూలై 20 (ప్రజా జ్యోతి ):** మండలంలో మూడు రోజుల మండలస్థాయి వృత్త్యంతర ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమం సోమవారం ఘనంగా ప్రారంభమైంది.కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి (ఎంఈవో) శ్రీ జి. నర్సిములు ముఖ్య అతిథిగా హాజరై శిక్షణను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాయికోడ్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కే. నగేష్,పాంపాడ్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు సంగీత,రిసోర్స్ పర్సన్స్ (ఆర్‌పీలు) తులసి,మల్లేశం,సురేష్,శ్రీహరి,లావణ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈవో జి. నర్సిములు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు శిక్షణలో పొందిన బోధనా పద్ధతులు,నూతన విద్యా విధానాలను తరగతి గదిలో సమర్థవంతంగా అమలు చేసి విద్యార్థుల అభ్యాస ఫలితాలను మెరుగుపర్చాలని సూచించారు.మారుతున్న విద్యా అవసరాలకు అనుగుణంగా ఉపాధ్యాయులు నిరంతరం తమ బోధనా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని అన్నారు.కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, రిసోర్స్ పర్సన్స్ శిక్షణలో బోధనా వ్యూహాలు,అభ్యాస మూల్యాంకనం, విద్యార్థి కేంద్రిత బోధన,వినూత్న బోధనా పద్ధతులు తదితర అంశాలపై ఉపాధ్యాయులకు మార్గదర్శకత్వం అందించారు. ఈ




శిక్షణ కార్యక్రమంలో మండలంలోని సీఆర్‌పీలు రాజు,దత్తుతో పాటు వివిధ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని శిక్షణను విజయవంతం చేశారు.మూడు రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణ ద్వారా ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యాలు మరింత మెరుగుపడి,విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు.

# ఎల్-నినో సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు






**జహీరాబాద్, జూలై 20(ప్రజా జ్యోతి న్యూస్)** సంగారెడ్డి జిల్లా పరిషత్ కార్యాలయంలో ఎల్–నినో ప్రభావ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికపై నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్షా సమావేశం లో జిల్లా ఇంఛార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి, ఎమ్మెల్సీ అంజి రెడ్డి, ఎమ్మెల్యేలు సునీత లక్ష్మారెడ్డి, చింత ప్రభాకర్ , సంజీవ్ రెడ్డి, జిల్లా కలెక్టర్‌తో కలిసి శాసన సభ్యులు కొనింటి మాణిక్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్ రావు మాట్లాడుతూ, నియోజకవర్గంలో తాగునీరు, భూగర్భ జలాలు, సాగునీటి లభ్యతకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు తలెత్త కుండా సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా అమృత్ పథకం పనులు నత్తనడకన సాగు తున్నాయని పేర్కొంటూ, వాటిని వేగవంతం చేసి ప్రజలకు నిరంతరాయంగా స్వచ్ఛమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఇంచార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి ని కోరారు. అలాగే, భూగర్భ జలాల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు, చెరువులు, కుంటలు, కాలువల ద్వారా సాగునీటి అవసరాలు తీర్చేందుకు ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని అధికారులను సూచించారు. వేసవి పరిస్థితులు ఎల్–నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీరు, భూగర్భ జలాలు, సాగునీటి వనరుల నిర్వహణతో పాటు విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ముందస్తు కార్యాచరణ చేపట్టాలని,ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే మాణిక్ రావు సూచించారు.

# సదాశివపేట లో జగన్నాథ రథ యాత్ర ను ప్రారంభించిన డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి

## సదాశివపేట పట్టణం లో ఇస్కాన్ ఆధ్వర్యం లో వైభవంగా జగన్నాథ రథయాత్ర

**సంగారెడ్డి (ప్రజా జ్యోతి)** అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో సదాశివపేట పట్టణంలో శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ ఆధ్యాత్మిక వేడుకకు డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, పూజలు నిర్వహించి రథయాత్రను ప్రారంభించారు.ఈ రథయాత్ర సదాశివపేట దుర్గమ్మ గుడి నుండి ప్రారంభమై శాస్త్రి రోడ్, హైవే, సుభాష్ రోడ్, గాంధీ చౌక్ మీదుగా బసవ సదన్ వరకు సాగింది. రథం కదిలిన వెంబడి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని 'జగన్నాథ్ కీ జై' అంటూ హరినామ స్మరణ చేశారు. యాత్ర పొడవునా భక్తులు చేసిన భజనలు, ఆధ్యాత్మిక నాట్యాలు, సంకీర్తనలతో పట్టణ వీధులన్నీ భక్తిపారవశ్యంతో మారుమోగాయి. ముఖ్యంగా మహిళా భక్తులు సాంప్రదాయ దుస్తులలో ప్రదర్శించిన కోలాట నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, వీక్షకులను అలరించాయి. భక్తులకు ఎక్కడికక్కడ ఇస్కాన్ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. సదాశివపేట పట్టణంలో జగన్నాథ రథయాత్రను నిర్వహిస్తూ, ఆధ్యాత్మికతను పెంపొందిస్తున్న





ఇస్కాన్ స్థానిక శాఖ ప్రతినిధులను నిర్మలా జగ్గారెడ్డి ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం లో సదాశివపేట మున్సిపల్ చైర్ పర్సన్ మునిపల్లె అంజమ్మ సత్యనారాయణ, వైస్ చైర్మన్ రేణుక చిరు, సిడిసి చైర్మెన్ రామ్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది కృష్ణ, నాయకులు సత్యనారాయణ, పృథ్వీ రాజ్, ఇస్కాన్ ప్రతినిధులు మరియు పట్టణ ప్రముఖులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ముందస్తు చర్యలతో ఎల్-నినో ప్రభావాన్ని సమర్ధవంతంగా ఎదుర్కొందాం

-మొదటిపేజీ తరువాయి

చేపట్టాల్సిన చర్యలు, ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికలు, జిల్లాల వారీ అమలు తీరుపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జహీరాబాద్, సంగారెడ్డి, నారాయణఖేడ్, నర్సాపూర్ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఎల్-నినో ప్రభావాన్ని తగ్గించేందుకు చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎల్-నినో ఒక సహజ ప్రకృతి విపత్తు అని, దీని ప్రభావాన్ని అర్థం చేసుకొని నష్టాన్ని వీలైనంత తగ్గించే దిశగా ముందస్తు ప్రణాళికతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. లోటు వర్షపాతం, నీటి కొరత, పంటలపై ప్రతికూల ప్రభావం వంటి పరిస్థితులను ముందుగానే అంచనా వేసి శాఖల వారీ కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక, గ్రామీణాభివృద్ధి, తాగునీటి సరఫరా, భూగర్భ జలాలు, విద్యుత్ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఒక ఎకరం వరి సాగుకు అవసరమైన నీటితో నాలుగు ఎకరాల ఆయిల్‌పామ్ లేదా ఎనిమిది ఎకరాల కంది పంట సాగు చేయవచ్చని పేర్కొన్నారు. రైతులు పరిస్థితులకు అనుగుణంగా తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలు, అంతర్ పంటల సాగుపై దృష్టి సారించేలా అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. రైతులకు అవగాహన కల్పించేందుకు వీడియో రీల్స్, నాటక ప్రదర్శనలు, కళాజాతాలు, అన్ని ప్రచార మాధ్యమాలను వినియోగించాలని సూచించారు. జిల్లాలో పలుచోట్ల కోతుల బెడద ఉన్నందున దానిని నివారించే చర్యలు చేపడితే రైతులు పంటల మార్పిడి వైపు మరింతగా మొగ్గు చూపే అవకాశం ఉంటుందని అన్నారు. ఎల్-నినో ప్రభావం తీవ్రత పెరిగితే భవిష్యత్తులో నీటి కొరత ఏర్పడే అవకాశాలు ఉన్నందున నీటి వృథాను అరికట్టడంతో పాటు భూగర్భ జలాల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. బోర్‌వెల్ల రీచార్జ్, వర్షపు నీటి సంరక్షణ, నీటి వినియోగంలో పొదుపు వంటి చర్యలను విస్తృతంగా అమలు చేయాలని సూచించారు. ప్రజలకు తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పశువులకు మేత కొరత ఏర్పడకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, అలాగే ఆరోగ్య శాఖ సీజనల్ వ్యాధుల నివారణతో పాటు ప్రజారోగ్య పరిరక్షణకు




అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి,ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేక అధికారి, ఎ. వాణి ప్రసాద్ మాట్లాడుతూ, ఎల్-నినోను ముందస్తుగా అంచనా వేసి ప్రభుత్వం ప్రతి శాఖను సమాయత్తం చేస్తోందన్నారు. అందుబాటులో ఉన్న అన్ని వనరులను సమర్థవంతంగా వినియోగిస్తూ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడడమే ఈ ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళిక ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు.

అనంతరం మంత్రి "జలసిరి" ప్రచార పోస్టర్లను, జిల్లా కంటింజెన్సీ ప్లాన్ ను ఆవిష్కరించారు.

అంతకుముందు వివిధ శాఖల అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వర్షపాత పరిస్థితులు, పంటల సాగు, భూగర్భ జలాల స్థితి, జలవనరులలో నీటి లభ్యత, విద్యుత్, తాగు నీటి సరఫరా, ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళిక తదితర అంశాలను వివరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేక అధికారి ఎ. వాణి ప్రసాద్, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, సంజీవరెడ్డి, మాణిక్‌రావు, సునీతా లక్ష్మారెడ్డి, అదనపు కలెక్టర్లు, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, వివిధ మున్సిపాలిటీల చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, మెదక్, సంగారెడ్డి జిల్లాల వివిధ శాఖల ఉన్నతాధి కారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఆత్మ కమిటీ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

## పనులు చేయకుండానే బిల్లుల చెల్లింపులు?

**కొండాపూర్ ప్రజా జ్యోతి** కొండాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి పథకాలు, పైప్‌లైన్ మరమ్మతులు, బోర్‌వెల్ మరమ్మతులు, మోటార్ మరమ్మతులు తదితర పనులు పూర్తి స్థాయిలో నిర్వహించకపోయినా బిల్లులు విడుదల చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లో పనులు కనిపించకపోయినా రికార్డుల్లో మాత్రం పూర్తయినట్లు నమోదు చేసి ప్రజాధనం దుర్వినియోగం జరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామస్థుల కథనం ప్రకారం, కొన్ని చోట్ల నెలల తరబడి తాగునీటి సమస్యలు కొనసాగుతున్నప్పటికీ సంబంధిత పనులకు బిల్లులు మంజూరు అయినట్లు సమాచారం ఉందని చెబుతున్నారు. ఈ వ్యవహారంలో కొందరు సర్పంచ్‌లతో పాటు గ్రామీణ నీటి సరఫరా (ఆర్డబ్ల్యూఎస్) శాఖ అధికారుల పర్యవేక్షణ కూడా ప్రశ్నార్థకంగా మారిందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామాల్లో జరిగిన పనుల నాణ్యత, వాస్తవ పరిస్థితులు పరిశీలించకుండా బిల్లులు ఆమోదిస్తున్నారనే ఆరోపణలపై జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక విచారణ చేపట్టి, రికార్డులు--స్థల పరిశీలన ద్వారా వాస్తవాలను వెలికి తీయాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామీణాభివృద్ధి పనుల్లో




పారదర్శకత, జవాబుదారీతనం అవసరమని నిపుణులు కూడా సూచిస్తున్నారు.

**స్థానికుల డిమాండ్:**

అనుమానాస్పద బిల్లులపై విజిలెన్స్ లేదా ఉన్నతస్థాయి విచారణ చేపట్టాలి. జరిగిన పనులకు సంబంధించి కొలత పుస్తకాలు (ఎం.బి లు), బిల్లులు, ఫొటోలు ప్రజలకు అందుబాటులో ఉంచాలి. అక్రమాలు రుజువైతే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుని ప్రభుత్వ నిధులను రికవరీ చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.జ


## మార్షల్ ఆర్ట్స్‌లో గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన చిన్నారికి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అభినందనలు



**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:** మార్షల్ ఆర్ట్స్‌లో విశేష ప్రతిభ కనబర్చి గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన చిన్నారి మాల్యే విహాన్‌ను సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తన క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విహాన్ తన తల్లిదండ్రులు రామేశ్వర్, అశ్విన్‌తో కలిసి ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. చిన్న వయస్సులోనే ప్రపంచ స్థాయిలో గుర్తింపు సాధించి సంగారెడ్డి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావడం గర్వకారణమని ఎమ్మెల్యే కొనియాడారు. భవిష్యత్తులోనూ మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో విజయాలు సాధించి దేశానికి కీర్తి తీసుకురావాలని ఆకాంక్షిస్తూ చిన్నారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జైపాల్ రెడ్డి, బుచ్చిరెడ్డి, నరహరి రెడ్డి, వసంత్ రెడ్డి తదితరులు పాల్గొని చిన్నారిని అభినందించారు.

## నేడే రేణుక ఎల్లమ్మ ఆలయంలో బోనాల సంబరాలు






**జహీరాబాద్, జూలై 20 (ప్రజా జ్యోతి న్యూస్)** జహీరాబాద్ పట్టణంలో ఆషాఢ మాస సందర్భంగా మంగళవారం 8వ వార్డు రాంనగర్ లో ఘనంగా నిర్వహించనున్న కాలనీ వాసులు. తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాల ప్రత్యేకగా నిలిచిన అమ్మ వారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకోవడం జరుగు తుంది. ఆషాఢ మాస అత్యంత పవిత్రమైన మాసం.ఆషాఢ మాస సందర్భంగా అత్యంత భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పిం చడం తరతరాలుగా వస్తున్న ఆచారం. ఈ ఆషాఢంలో మహిళలు కొత్త వస్త్రాలు ధరించి అమ్మవారి భవనం తలపై ఎత్తుకొని అంగరంగ వైభవంగా పోతురాజుల వేషాలతో ఆటపాటలతో నృత్యాలు చేస్తూ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయానికి చేరుకుంటారు. ఇంటింటి నుండి బోనాలు ఊరేగింపు నిర్వహిస్తూ రేణుక ఎల్లమ్మ ఆలయానికి వచ్చి పూజ నిర్వహించడం జరుగు తుంది. అనంతరం వచ్చిన భక్తులు కాలనీవాసులు అమ్మవారి దగ్గర నిర్వహించే ప్రసాద విందు భోజనంలో పాల్గొంటారు. అనంతరం పోతరాజులతో భాజా భజంత్రీ లతో కాలనీలో వీధి వీధికి ఆటపాటలతో ఊరేగింపులు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు తదితరులు పాల్గొంటారు.

# సమయపాల న పాటించని పంచాయతీ కార్యదర్శులు

**ఎస్ఐఆర్ కీలక సమయంలోనూ నిర్లక్ష్యం ఎందుకు?**

**ఆలస్యంగా హాజరు ముందుగానే తిరుగు ప్రయాణం ..**

**కొండాపూర్ ప్రజా జ్యోతి** మండల పరిధిలోని 24 గ్రామపంచాయతీల్లో సగానికి పైగా పంచాయతీలలో కార్యదర్శులు నిర్ణీత కార్యాలయ సమయాలను పాటించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉదయం కార్యాలయానికి సమయానికి హాజరు కాకుండా కొందరు ఉదయం 10:30 నుంచి 11:30 గంటల మధ్య గ్రామాలకు వచ్చి, మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలోనే వెళ్లిపోతున్నారని గ్రామస్థులు చెబుతున్నారు. ప్రస్తుతం ఎస్ఐఆర్ ఓటరు నమోదు ప్రక్రియ యుద్ధప్రాతిపదికన కొనసాగుతున్న సమయంలోనూ కొందరు పంచాయతీ కార్యదర్శులు పూర్తి సమయం గ్రామాల్లో అందుబాటులో ఉండటం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. హాజరు నమోదుకు, ఫోటోలు దిగడానికి మాత్రమే కార్యాలయానికి వస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. గ్రామపంచాయతీల్లో ప్రజలు ధృవపత్రాలు, పన్నులు, ఇతర పరిపాలనా పనుల కోసం కార్యాలయాలకు వెళ్లినప్పుడు, "మండలంలో మీటింగ్ ఉంది", "కలెక్టరేట్‌లో సమావేశం ఉంది", "బ్యాంకుకు వెళ్లాం" వంటి కారణాలు చెబుతూ పనులు వాయిదా వేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ కొనసాగుతున్న సమయంలోనే రెండు గ్రామపంచాయతీల కార్యదర్శులు సెలవులకు వెళ్లి ఇప్పటికీ విధుల్లో చేరలేదని సమాచారం. దీంతో ఓటరు నమోదు పనులు




ప్రభావితమవుతున్నాయని స్థానికులు అంటున్నారు. ఈ అంశంపై పై అధికారులకు ఫిర్యాదు చేస్తే, "ఎవరైనా సమయానికి రాకపోతే ఫోటోలు తీసి పంపండి... పరిశీలించి చర్యలు తీసుకుంటాం" అని చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన సందర్భాలు కనిపించడం లేదని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలంటే పంచాయతీ కార్యదర్శులు నిర్ణీత సమయాల్లో కార్యాలయాల్లో అందుబాటులో ఉండేలా చూడాలని, ఎస్ఐఆర్ వంటి కీలక కార్యక్రమాలను నిర్లక్ష్యం చేయకుండా ఉన్నతాధికారులు గ్రామాల్లో పర్యటించి పర్యవేక్షణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# ఎల్-నినో ప్రభావానికి ముందస్తు ప్రణాళికలతో సిద్ధం కావాలి

**-ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి**

**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి, జూలై 20:** ఎల్-నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. ఎల్-నినో ప్రభావ తీవ్రతను తగ్గించేందుకు, ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయడంపై సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎమ్మెల్సీ అంజి రెడ్డి, ఉమ్మడి మెదక్, సంగారెడ్డి జిల్లాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ..ఎల్-నినో ప్రభావంతో ఏర్పడే వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, వ్యవసాయ రంగానికి నష్టం కలగకుండా ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ యంత్రాంగం ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు




తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, సాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నారాయణఖేడ్ నియోజకవర్గంతో పాటు ఉమ్మడి జిల్లా పరిధిలోని మారుమూల గ్రామాల్లో ప్రజలకు, రైతులకు అవసరమైన సేవలు అందేలా ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికలను క్షేత్రస్థాయిలో వేగంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మహీంద్రా కంపెనీ సహకారంతో బిలాల్ పూర్ పాఠశాలకు సుందరికరణ పనులు ప్రారంభం



**జహీరాబాద్, జూలై 20 ( ప్రజా జ్యోతి న్యూస్ )** కోహీర్ మండల పరిధిలోని బిలాల్ పూర్ గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశా లలో మహీంద్రా కంపెనీ సౌజన్యంతో పాఠశాల వసతుల కల్పన, మరమ్మత్తులు, పెయింటింగ్ సుందరీకరణ పనులు ప్రారంభమయ్యాయి. సోమవారం మహీంద్రా కంపెనీ యాజమాన్య బృందం పాఠశాలను సందర్శించి, ప్రధానోపాధ్యాయురాలు సి. సుచరితతో మాట్లాడి, అవసరాలను తెలుసుకుని పూజా కార్యక్రమం తో పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో బిలాల్ పూర్ గ్రామ సర్పంచ్ స్వర్ణలత అశోక్ పాల్గొని 10వ తరగతి విద్యార్థి నులతో కలిసి మధ్యాహ్న భోజనం సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మహీంద్రా కంపెనీ యాజమాన్యం, ప్రధానోపాధ్యాయురాలు సుచరిత, గ్రామ సర్పంచ్ స్వర్ణకళ అశోక్, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## దివంగత ఉపాధ్యాయుడు భూమయ్యకు నివాళులు



**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 20:** నారాయణఖేడ్ మండలంలోని సంజీవరావుపేట గ్రామానికి చెందిన దివంగత ఉపాధ్యాయుడు భూమయ్య వర్ధంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో అంబేద్కర్ పూలే సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ రహీం పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా భూమయ్య ఉపాధ్యాయుడి సేవలను స్మరించుకుంటూ, సమాజాభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాలూకా ఎస్సీ సెల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గైని సాయిలు, అంబేద్కర్ పూలే సేవా సమితి డివిజన్ అధ్యక్షులు ఎస్. నర్సింలు, నాగల్‌గిద్ద మండల ప్రధాన కార్యదర్శి శివానంద్, ఉపాధ్యాయులు, నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొని భూమయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

# గులాబీ కంచుకోటపై కాంగ్రెస్ కన్ను

**కరీంనగర్ :** తెలంగాణ రాజకీయ క్షేత్రంలో ఇప్పుడు సరికొత్త, అత్యంత వ్యూహాత్మకమైన అంతర్గత పోరాటం సాగుతోంది. నిన్నటివరకు తిరుగులేని రాజకీయ శక్తులుగా, అజేయమైన కోటలుగా వెలిగిన బీఆర్ఎస్ టాప్ లీడర్ల సొంత నియోజకవర్గాలపై అధికార కాంగ్రెస్ పార్టీ ప్రత్యేకంగా కన్నేసింది. గులాబీ దళపతి కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అడ్డా సిరిసిల్ల, ట్రబుల్ షూటర్ హరీష్ రావు కంచుకోట సిద్దిపేట నియోజకవర్గాల్లో పొలిటికల్ హీట్ అమాంతం పెరిగింది. ప్రధాన నేతలను నేరుగా ఢీకొట్టడం కంటే, వారి రాజకీయ పునాదులను కదిలించేలా ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని టార్గెట్ చేస్తూ కాంగ్రెస్ వేస్తున్న అడుగులు క్షేత్రస్థాయి రాజకీయాలను వేడెక్కిస్తున్నాయి.నిన్నటివరకు బీఆర్ఎస్ పార్టీకి వెన్నుముకగా నిలిచిన స్థానిక సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, మండల పార్టీ అధ్యక్షులను కాంగ్రెస్ స్థానిక నియోజకవర్గ ఇన్‌ఛార్జులు వ్యూహాత్మకంగా ఆకర్షిస్తున్నారు. ముఖ్యంగా గజ్వేల్ ? సిద్దిపేట సరిహద్దు ప్రాంతాల్లో ఈ సైలెంట్ ఆపరేషన్ అత్యంత వేగంగా విస్తరిస్తోంది. టాప్ లీడర్లు హైదరాబాద్‌లోనే ఉంటూ అసెంబ్లీ లేదా మీడియా వేదికలపై కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాడుతుంటే, క్షేత్రస్థాయిలో మాత్రం హస్తం శ్రేణులు గ్రామాల్లోని కరడుగట్టిన బీఆర్ఎస్ కార్యకర్తలను టార్గెట్ చేస్తున్నారు. గజ్వేల్ లాంటి ప్రాంతాల్లో క్యాంప్ ఆఫీసుల చుట్టూ జరుగుతున్న రాజకీయ ఘర్షణలు, నిరసనలు కేవలం పైకి కనిపిస్తున్న ఊహాగానాలు కావు, లోపల మాత్రం కాంగ్రెస్ తన పనిని నిశ్శబ్దంగా పూర్తి చేస్తోంది. పదేళ్ల కాలంలో గ్రామాల్లో పనులు చేసి బిల్లులు రాక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న మాజీ సర్పంచులు, నిధుల కొరతతో సతమతమవుతున్న ప్రజాప్రతినిధుల బలహీనతలను కాంగ్రెస్ పార్టీ క్యాష్ చేసుకుంటోంది. వారికి అధికార పార్టీ అండగా ఉంటుందనే భరోసా ఇస్తూనే, మూడు రకాల ఆకర్షణీయమైన వ్యూహాలను అమలు చేస్తోంది. త్వరలో రాబోయే నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పిస్తామని లేదంటే స్థానిక నిధుల కేటాయింపుల్లో ప్రాధాన్యత ఇస్తామని హామీలు ఇస్తోంది. దారికి రాకపోతే అధికార బలంతో స్థానిక పనులకు బ్రేకులు వేయడం లేదా సహకరించడం ద్వారా ఒత్తిడి పెంచుతోంది. బీఆర్ఎస్ అధిష్టానానికి, స్థానిక లీడర్లకు మధ్య గ్యాప్ పెంచేందుకు ప్రయత్నిస్తోంది. మీరు ప్రతిపక్ష పార్టీలో ఉంటే మీకు లాభం ఉండదని, అధికార పార్టీలోకి వస్తే గ్రామాల అభివృద్ధి సాధ్యమనే ప్రచారాన్ని క్యాడర్‌లోకి బలంగా తీసుకెళు _న్నారు. దీనివల్ల నియోజకవర్గ కేంద్రాల్లో బీఆర్ఎస్ ఇంకా బలంగానే కనిపిస్తున్నా, లోపలి గ్రామాల్లో మాత్రం గులాబీ కోటల పునాదులు నెమ్మదిగా బలహీనపడుతున్నాయి.అయితే, ఈ ఆపరేషన్ కాంగ్రెస్‌కు అంత సులభంగా ఏకపక్షంగా సాగడం లేదు. సిద్దిపేట, గజ్వేల్ పరిసర ప్రాంతాల్లో హరీష్ రావు లాంటి సీనియర్ నేతలు రంగంలోకి దిగి డ్యామేజ్ కంట్రోల్ చర్యలు చేపట్టారు. అలకపాన్పు ఎక్కిన కార్యకర్తలను బుజ్జగించేందుకు, పార్టీ మారిన వారిని తిరిగి సొంత గూటికి చేర్చుకునేందుకు గట్టిగానే ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల వైఫల్యాలను, స్థానిక సంస్థల ఎన్నికల జాప్యాన్ని ఎండగడుతూ రివర్స్ అటాక్ చేస్తున్నారు. అయినప్పటికీ, అధికార పార్టీ విసిరిన వ్యూహాత్మక వలయం వల్ల ద్వితీయ శ్రేణి నాయకత్వంలో కొంత అయోమయం స్పష్టంగా కనిపిస్తోంది. కంచుకోటలుగా భావించే ఈ మూడు నియోజకవర్గాల్లో క్యాడర్ గనుక చెల్లాచెదురైతే, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అది బీఆర్ఎస్ ఉనికికే ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది.గులాబీ నేతలకు హస్తం పార్టీ వేస్తున్న ఈ గాలం కేవలం తాత్కాలిక రాజకీయ ప్రయోజనాల కోసం లేదా కేవలం స్థానిక లీడర్లను మార్చడం కోసం మాత్రమే కాదు. దీని వెనుక పెద్ద స్కెచ్ ఉంది. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులను రాష్ట్రస్థాయి రాజకీయాలపై దృష్టి పెట్టకుండా, వారి వారి సొంత నియోజకవర్గాల రక్షణలోనే నిరంతరం బిజీగా ఉంచాలనేది కాంగ్రెస్ మార్క్ హైలెవల్ పొలిటికల్ స్ట్రాటజీ. తద్వారా రాష్ట్రస్థాయిలో ప్రభుత్వంపై వారి దూకుడును తగ్గించవచ్చని కాంగ్రెస్ భావిస్తోంది. ఈ మైండ్ గేమ్‌లో అధికార కాంగ్రెస్ ఎంతవరకు సఫలమవుతుంది, గులాబీ త్రయం తమ కంచుకోటలను ఎలా కాపాడుకుంటుంది అనేది రాబోయే రోజుల్లో తేలనుంది.

# అధిష్టానం ఎంట్రీతో ఈటెల, బండి మధ్య గ్యాప్ తగ్గినట్టేనా

**హైదరాబాద్ :** తెలంగాణ భారతీయ జనతా పార్టీలో గత కొంతకాలంగా సాగుతున్న అంతర్గత విభేదాలకు చెక్ పెట్టేందుకు అధిష్టానం ప్రయత్నాలు షురూ చేసింది. రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పెట్టుకున్న ఢిల్లీ పెద్దలు, ఇక్కడి కీలక నేతల మధ్య ఉన్న కోల్డ్ వార్‌ను ముగించడానికి నేరుగా రంగంలోకి దిగారు. ఇందులో భాగంగానే పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్, ఎమ్మెల్యే అభయ్ పాటిల్ ఆధ్వర్యంలో బుజ్జగింపుల పర్వం ఊపందుకుంది. రాష్ట్ర బీజేపీలో అత్యంత కీలక నేతలుగా ఉన్న కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ మధ్య సయోధ్య కుదిర్చేందుకు హైకమాండ్ గట్టి ప్రయత్నాలే చేస్తోందిఈ వివాదాన్ని వీలైనంత త్వరగా సమసిపోయేలా చూడాలనే పట్టుదలతో అధిష్టానం ఉంది. ఇందులో భాగంగానే శుక్రవారం రాత్రి ఈటల రాజేందర్ నివాసానికి వెళ్లిన అభయ్ పాటిల్, రాత్రి పొద్దుపోయే వరకు ఆయనతో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. పార్టీ అంతర్గత పరిణామాలు, విభేదాలకు గల కారణాలపై ఆయనతో ఆరా తీశారు. అనంతరం బండి సంజయ్‌తో కూడా అభయ్ పాటిల్ భేటీ అయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.ఈ క్రమంలోనే ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ నివాసంలో ఒక కీలకమైన భేటీ జరగనుంది. ఈ మీటింగ్‌కు ఈటల రాజేందర్, బండి సంజయ్ ఇద్దరూ హాజరుకానుండటం విశేషం. అధిష్టానం దూతలుగా వచ్చిన సునీల్ బన్సల్, అభయ్ పాటిల్ సమక్షంలో ఈ ఇద్దరు నేతలను ఒకే వేదికపైకి తెచ్చి, వారి మధ్య ఉన్న మనస్పర్థలను తొలగించడానికి లక్ష్మణ్ నివాసం వేదిక కాబోతోంది.కొంతకాలంగా ఈటల రాజేందర్, బండి సంజయ్ మధ్య సఖ్యత లోపించిన విషయం బహిరంగ రహస్యమే. ఒకరిపై మరొకరు పరోక్షంగా పలుమార్లు విమర్శలు, ఆరోపణలు గుప్పించుకున్నారు. ఈ ఇద్దరు నేతల మధ్య ఉన్న గ్యాప్ చూసి వారి అనుచరులు, అభిమానులు మరింత రెచ్చిపోయారు. పలు సందర్భాల్లో పరస్పర వ్యతిరేక పోస్టర్లు, ఫ్లెక్సీలు కూడా వెలిశాయి. ఈ అంతర్గత విభేదాలు క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్‌ను తీవ్ర గందరగోళానికి గురిచేశాయి. ఈ ప్రభావం పార్టీ బలోపేతంపై పడుతుండటంతో ఢిల్లీ పెద్దలు అలర్ట్ అయ్యారు.ఇటీవల తెలంగాణలో పర్యటించిన జాతీయ నేతలు నితిన్ నబీన్, జేపీ నడ్డా సైతం రాష్ట్ర నేతలకు స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. వ్యక్తిగత విభేదాలను పక్కన పెట్టి, పార్టీ ప్రయోజనాలే పరమావధిగా పనిచేయాలని కరాఖండిగా చెప్పారు. అయినప్పటికీ ఆశించిన స్థాయిలో మార్పు రాకపోవడంతో, ఇప్పుడు నేరుగా హైకమాండ్ రాయబారాన్ని పంపింది. తెలంగాణలో అధికారమే పరమావధిగా భావిస్తున్న బీజేపీకి ఈ ఇద్దరు నేతలూ అత్యంత అవసరం. బండి సంజయ్ మాస్ లీడర్‌షిప్, కేడర్‌లో ఉన్న ఫాలోయింగ్ పార్టీకి ఎంత ప్లస్సో.. ఈటల రాజేందర్ రాజకీయ అనుభవం, వ్యూహాలు అంతే ముఖ్యం. వీరిలో ఏ ఒక్కరిని వదులుకోవడానికి లేదా దూరం పెట్టడానికి అధిష్టానం సిద్ధంగా లేదు. ఇద్దరి బలాలు కలిస్తేనే తెలంగాణలో అనుకున్న లక్ష్యాన్ని సాధించగలమని ఢిల్లీ పెద్దలు బలంగా నమ్ముతున్నారు.అధిష్టానం నేరుగా రంగంలోకి దిగడం, ఇవాళ ఎంపీ లక్ష్మణ్ నివాసంలో ఇద్దరు కీలక నేతలు ముఖాముఖి కూర్చోనుండటంతో ఈ భేటీపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ చర్చల తర్వాతైనా ఇద్దరు నేతలు తమ పంతాలను వీడి, పార్టీ కోసం కలిసి నడుస్తారని సాధారణ కార్యకర్తలు, క్యాడర్ ఆశగా ఎదురుచూస్తున్నారు. మరి ఢిల్లీ పెద్దల బుజ్జగింపులు ఎంతవరకు పారుతాయో, టీ బీజేపీలో ఈ అంతర్గత సంక్షోభానికి తెరపడుతుందో లేదో చూడాలి.

# చిలుకూరులో మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య పంట పొలాల పరిశీలన..

**రైతులు, వ్యవసాయ కూలీలతో మాజీ ఎమ్మెల్యే భేటీ**

**సూర్యాపేట :** చిలుకూరు మండల కేంద్రంలోని పంట పొలాలను పరిశీలించిన కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ రైతులు, వ్యవసాయ కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సాగునీటి కొరతతో నాట్లతో పచ్చగా కళకళలాడాల్సిన పొలాలు బీడుగా మారే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలపై నిపుణులు ముందుగానే హెచ్చరించినప్పటికీ ప్రభుత్వం తగిన ముందస్తు చర్యలు తీసుకోలేదని విమర్శించారు.భూగర్భ జలాలు తగ్గిపోవడంతో బోర్లలో నీరు అందక రైతులు పరిమిత విస్తీర్ణంలోనే సాగు చేస్తున్నారని, రైతులు వ్యవసాయం చేయలేకపోతే వ్యవసాయ కూలీలకు కూడా ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులు తప్పవని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూలీలు పనుల కోసం ఎదురుచూస్తున్నా ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు.సాగునీటి లభ్యతపై ప్రభుత్వం వెంటనే

# పాస్తాపూర్ లో మురికి కాల్వల నిర్మాణానికి శంకుస్థాపన

**ఆర్యనగర్ లో తాగునీటి సమస్య పరిష్కారానికి బోరు మోటర్ ఏర్పాటు**



**జహీరాబాద్, జులై 20(ప్రజా జ్యోతి న్యూస్ )**జహీరాబాద్ మున్సిపల్ పరిధిలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించే దిశగా అభివృద్ధి పనులు కొనసాగు తున్నాయని మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ తెలిపారు. సోమవారం 3వ వార్డు పరిధిలోని పాస్తాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించ నున్న మురికి కాల్వల పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన చైర్మన్ మహమ్మద్ యూనుస్, వర్షకాలంలో నీరు నిల్వ ఉండకుండా, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ఆధునిక ప్రమాణాలతో మురికి కాల్వలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. కాల్వల నిర్మాణం పూర్తయిన అనంతరం పారిశుద్ధ్య పరిస్థితులు మెరుగుపడి, దోమల వ్యాప్తి, అంటు వ్యాధుల ప్రమాదం తగ్గడం తో పాటు స్థానికులకు మెరుగైన వాతావరణం ఏర్పడుతుందని అన్నారు. అనంతరం ఆర్యానగర్ లో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు నూతన బోరు మోటార్ ను ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ బోరు ద్వారా స్థానిక ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందేలా చర్యలుతీసుకున్నా మని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మున్సిపాలిటీ అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తుందని తెలిపారు. ప్రజల సమస్యలను ఎప్పటి కప్పుడు గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తున్నా మని, ప్రతి వార్డులో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నా మని ఆయన అన్నారు. ప్రజల సహకారంతో జహీరాబాద్ ను మరింత అభివృద్ధి చెందిన పట్టణము గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా వార్డుల కౌన్సిలర్లు శ్రీధర్ రెడ్డి, బొగ్గుల సంతోష్, బిజెపి పార్టీ పట్టణ అధ్యక్షులు పూల సంతోష్, సీనియర్ నాయకులు సుధీర్ బండారి, రాజకీయ ప్రముఖులు, పార్టీ నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ అధికారులు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

